## మోసం చేసి కోట్లు దండుకున్న నకిలీ టాస్క్ ఫోర్స్ ముఠా..!

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలో మోసాల ముఠా రెచ్చిపోయింది. ట్రస్ట్ లను లక్ష్యంగా చేసుకుని CSR ఫండ్స్ ఇప్పిస్తామని నమ్మించి, పెద్ద మొత్తంలో దోచుకున్న ముఠా గుట్టు మలక్‌పేట పోలీసుల దర్యాప్తులో బయటపడింది.నగరంలోని ఓ ట్రస్ట్‌ను లక్ష్యంగా చేసుకున్న ఈ ముఠా.. నకిలీ డాక్యుమెంట్లు, టాస్క్ ఫోర్స్ యూనిఫార్ములతో సినిమా స్టైల్‌లో మోసానికి పాల్పడింది. ఈ ముఠా సభ్యులు ట్రస్ట్‌ల వద్దకు వెళ్లి.. మా వల్ల మీరు భారీగా CSR ఫండ్స్ పొందవచ్చు అంటూ నమ్మకం కల్పించారు. అయితే, అందులో 50 శాతం తమకు ఇవ్వాలని అగ్రిమెంట్ చేయించి, ముందుగా ఒక కోటి రూపాయలు అడ్వాన్స్‌గా ఇవ్వాలని కోరారు. ట్రస్ట్ లోని ఒక సభ్యుడు కోటి రూపాయలు సమకూర్చగా, ఆ తర్వాత ఘటన ఆశ్చర్యానికి గురిచేస్తోంది.నకిలీ టాస్క్ ఫోర్స్ యూనిఫార్మ్‌లో వచ్చిన కొంతమంది, ట్రస్ట్ సభ్యుడి ఇంటికి వెళ్లి ఒక ఫేక్ బ్యాంక్ ఖాతా వివరాలు చూపించి.. “మీ అకౌంట్ నుంచి 6 కోట్ల రూపాయలు అనధికారికంగా ట్రాన్స్‌ఫర్ అయ్యాయి.. సమాధానం చెప్పాలి” అంటూ బెదిరించారు. అంతేగాక, ఈ విషయం బయటకు రాకుండా చూడాలంటే 50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :118 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 10-07-2025 | పేజీలు:4 వెల: 2.00


## ప్రతి పైసాకు అకౌంటబిలిటీ.. మరింత పారదర్శకంగా తీర్చిదిద్దడమే లక్ష్యం..!



న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా మైనింగ్ రంగాన్ని మరింత పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తాజాగా ఢిల్లీలో మాట్లాడారు.డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ పై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనింగ్ ద్వారా వచ్చే ప్రతి పైసాకు అకౌంటబిలిటీ ఉండేలా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.గతంలో అక్రమ మైనింగ్ అనేది పెద్ద స్థాయిలో జరిగేదని గుర్తు చేసిన కిషన్ రెడ్డి, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకున్న చర్యల ఫలితంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా మైనింగ్ పూర్తి స్థాయిలో మైనింగ్ పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కోసం కేంద్రం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ను ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా వచ్చే నిధులను మైనింగ్ వల్ల ప్రభావితమవుతున్న ప్రాంతాల్లో అభివృద్ధి కోసం వినియోగిస్తున్నామని చెప్పారు.DMF కు జిల్లా కలెక్టర్లు చైర్మన్ లుగా వ్యవహరిస్తారు. కాగా, మూడు రోజుల క్రితం వరకు తెలంగాణలో మాత్రం మంత్రులే DMF చైర్మన్‌లుగా ఉన్నారని, తాజాగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి కలెక్టర్లను చైర్మన్‌లుగా నియమించిందని పేర్కొన్నారు. %ఐవీఖీ% లో ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా భాగస్వాములుగా ఉండేలా వ్యవస్థను ఏర్పాటు చేశామని, మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి కలెక్టర్లే కీలక పాత్ర పోషిస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. అలాగే డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ స్థాపించి ఇప్పటికి పదేళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీలో జరిగిన వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా గనులు ఉన్న జిల్లాల కలెక్టర్లు, ఆయా రాష్ట్రాల గనుల శాఖ అధికారులు పాల్గొని అభిప్రాయాలు పంచుకున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు ఫోన్, ల్యాప్ ట్యాప్ సీజ్

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాలలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్ రావు కు చెందిన ల్యాప్ టాప్, సెల్ ఫోన్ లను సిట్ అధికారులు సీజ్ చేశారు. మరో సెల్ ఫోన్ కూడా అప్పగించాలని సిట్ సూచించింది. సిజ్ చేసిన సెల్ ఫోన్, ల్యాప్ టాప్ ను ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ కి పంపించారు. వాటిలోని డేటా రికవరికి ప్రయత్నిస్తున్నారు. కాగా ప్రభాకర్ రావును గురువారం మరోసారి విచారణకు హాజరుకావాలని సిట్ ఆదేశించింది. దుబ్బాక, హుజూర్ నగర్, మునుగోడు ఉప ఎన్నికలు సహా 2023అక్టోబర్ నుంచి గత ఏడాది మార్చి వరకు ప్రభాకర్ రావు కాల్ డేటాను సిట్ సేకరించింది. ప్రణిత్ రావు, రాధాకిషన్, భుజంగరావు, తిరుపతన్నల సెల్ ఫోన్ కాల్ డేటాల అధారంగా వారి నుంచి కీలక సమాచారం రాబట్టిన సిట్ ప్రభాకర్ రావు కాల్ డేటా అధారంగా ఆయనను మరోసారి ప్రశ్నించనుంది.ప్రభాకర్ రావు ఫోన్ కాల్ డేటా, వాట్సాస్ కాలింగ్, ఫేస్ టైమ్ సహా యాప్స్ ల ద్వారా మాట్లాడిన డేటా రిట్రీట్ కోసం సిట్ ప్రయత్నిస్తుంది. ప్రభాకర్ రావు, ప్రణీత్ రావులు



మాట్లాడిన నాయకులు, అధికారులు కూడా తమ ఫోన్లలో డేటాను డిలీట్ చేసే అవకాశముందని దర్యాప్తు బృందం అనుమానిస్తుంది. 2023అక్టోబర్ 15నుంచి గత 30 వరకు అందిన సర్వీసు ప్రొవైడర్ డేటాలో 618 ఫోన్ నెంబర్లు ఉ ండగా..ధ్వంసమైన ఎస్ఐబీ హార్డ్ డిస్క్ లలో, నిందితుల ఫోన్లలో ఇంకా ఎందరి ఫోన్ నెంబర్లు..డేటా ఉన్నాయోనన్న కోణంలో సిట్ విచారిస్తుంది.

## రవాణా శాఖలో సంస్కరణలు ...మంత్రి పొన్నం



హైదరాబాద్, ప్రజల సౌకర్యార్థం రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ) అన్నారు. బుధవారం నాడు రాజా బహదూర్ వెంకటరామ రెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసిన 96 మంది అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లల AMVI పాసింగ్ ఔట్ పరేడ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తీసుకొచ్చి వెహికిల్ ఫిట్నెస్ చేస్తున్నామని మంత్రి చెప్పారు. మీరంతా రవాణా శాఖలోకి రావడం వల్ల ఈ డిపార్ట్ మెంట్ మరింత పటిష్టం అయిందన్నారు.

క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్

దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడితే క్యాష్ లెస్ ట్రీట్మెంట్ విధానం కేంద్రం తీసుకొచ్చిందని మంత్రి పొన్నం తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే విధుల్లో ఉన్న 300కి పైగా సిబ్బందికి రెండు నెలల చొప్పున శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఈవీ, సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. దేశంలో రవాణా శాఖలో నియామకం అవుతున్న వారందరికీ మీరు రోల్ మోడల్ గా ఉండాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని విధంగా మంచి పేరు తెచ్చుకుంటూ తల్లిదండ్రులతోపాటు మీ గ్రామాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

యువతకు ఉపాధి అవకాశాలు

రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రవాణా శాఖలో పలు కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. నాలుగు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న ఏఎంవీఐలకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో అనేక ప్రజాయుత కార్యక్రమాలు తెచ్చిందని దాంతో తెలంగాణ రవాణా శాఖ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఏఎంవీఐలు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి మీ శక్తి ఉపయోగించాలని యాక్సిడెంట్ లో డెత్ రేట్ తగ్గించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాడంతో పాటు ట్రాఫిక్ ఉల్లంఘన చేస్తున్న వారిపై ఎన్ ఫోర్స్మెంట్ చేస్తూ కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏవీఎంఐల గౌరవ వందనం స్వీకరించి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఏవీఎంఐలకు అవార్డులు ప్రదానం చేశారు.

## బంద్ తో వెలవెలబోయిన బొగ్గు గనులు

భూపాలపల్లి: దేశ వ్యాప్తం సమ్మెలో భాగంగా సింగరేణి కార్మిక జేఏసీ పిలుపుమేరకు భూగర్భ గనులతో పాటు ఓపెన్ కాస్ట్ గనుల్లో కార్మికులు బుధవారం ఒక్క రోజు సమ్మె చేశారు. అత్యవసర సిబ్బంది మినహా మిగిలిన కార్మికులంతా సమ్మె పాల్గొన్నారు. దీంతో బొగ్గు గనులు వెలవెలబోయాయి. సింగరేణి బొగ్గు గనుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం కార్మికులపై ఆలంబిస్తున్న వ్యతిరేక విధానాలు, 44 కార్మిక చట్టాలు నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలంటూ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయవద్దంటూ కోరాయి.

నిలిచిన బొగ్గు ఉత్పత్తి

కార్మికుల సమ్మెతో భూపాలపల్లి డివిజన్‌లను కాకతీయ బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచి పోయింది. భూపాలపల్లి ఏరియాలో సుమారు ఆరు వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి కి అంతరాయం వాటిల్లగా సింగరేణి సంస్థ కు సుమారు రూ. 3 కోట్ల మేర నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. కాగా కార్మిక సంఘాల



ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ తదితర కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలంటూ ఆయా గనుల వద్ద నల్ల బాడ్జిలతో నిరసన తెలిపారు. అంబెడ్కర్ కూడలిలో మానవహారం, ధర్నా చెపట్టి నిరసన వ్యక్తం చేశారు. 90 శాతం కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో కార్మికులు సుమారు రూ. 1కోటీ 60లక్షల జీతాలు నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు.

## పాఠశాల్లలో మధ్యాహ్న భోజనానికే కరువు

హైదరాబాద్,జూలై 9: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం పెట్టలేని దుస్థితిలో ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. విద్యార్థుల కడపునింపని సీఎం.. విజన్ 2047 గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మండిపడ్డారు. మధ్యాహ్న భోజనం బిల్లులు 3 నెలలుగా చెల్లించలేదు. మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం అందించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ అలసత్వం వల్ల ఎక్కడా అమలు కావడం లేదు. విద్యార్థులకు ఒకపూట అన్నంపెట్టే పరిస్థితిలో కూడా లేరా? మంత్రి లేని అనాథగా విద్యాశాఖ ఇంకెన్నాళ్లు ఉండాలి? విద్యాశాఖ చూసేందుకు కాంగ్రెస్‌లో సమర్థమైన మంత్రి లేరా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 20 నెలల పాలనలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కూడా అందించలేని దుస్థితికి ఈ ప్రభుత్వం చేరుకున్నది అని విమర్శించారు. మూడు నెలలుగా భోజన బిల్లులు చెల్లించకపోవడం వల్ల, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గొడ్డుకారం, నీళ్ల సాంబారే భావి భారత పౌరులకు భోజనం అయింది. మెనూ ప్రకారం పోషకాలతో కూడిన భోజనం అందించవలసి ఉన్నప్పటికీ ప్రభుత్వ అలసత్వం వల్ల ఎక్కడా అమలు కావడం లేదు. తనిఖీలు చేయవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే దుస్థితి ఉన్నప్పటికీ పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తానని కోతలు కోసే రేవంత్ రెడ్డీ.. కనీసం విద్యార్థులకు ఒకపూట అన్నం పెట్టే పరిస్థితిలో కూడా లేవా? అని ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్



స్కూలు, స్కిల్ యూనివర్సిటీ– అని మాటలు కోటలు దాటుతాయి కానీ చేతలు మాత్రం గడప కూడా దాటని పరిస్థితి. నీ నిర్లక్ష్యంతో ఒకవైపు గురుకులాల ఖ్యాతిని దిగజార్చావు.. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని పోగొడుతున్నావు. విద్యాశాఖ నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీలో సమర్థవంతమైన మంత్రి లేడా అని అన్నారు. ఇంకెన్నాళ్లు మంత్రి లేని అనాధగా విద్యాశాఖ ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ డ్రాప్ అవుట్స్ తగ్గించేందుకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకానికి తూట్లు– పొడిచి మళ్ళీ విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ ట్రిప్పులు, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, పొలిటికల్ డైవర్షన్లు బంద్ పెట్టి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించండి. విద్యాశాఖపై సమీక్ష చేయండి. మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే విడుదల చేయండి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## పాడైన రోడ్లు, నాలాల సమస్యలతో ప్రజలు వస్తున్నారు..



న్యూఢిల్లీ,బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన రాజకీయ జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచిన కంగనా.. ఒకవైపు సినిమాలు చేస్తునే మరోవైపు తన నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటుంది. అయితే రీసెంట్‌గా ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన కంగనా తన రాజకీయ జీవితంపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది.కంగనా మాట్లాడుతూ.. తాను రాజకీయాల్లో ఇంకా పూర్తిగా స్థిరపడలేదని, ఎంపీగా గెలిచిన కూడా ప్రస్తుతానికి దాన్ని ఆస్వాదించడం లేదని తెలిపారు. ప్రజలు తన వద్దకు “పాడైపోయిన రోడ్లు, నాలాల” వంటి స్థానిక సమస్యలతో వస్తున్నారని ఆమె వెల్లడించారు. పాలిటిక్స్ చాలా భిన్నమైన పని, సామాజిక సేవ లాంటిది. ఇది నా నేపథ్యం కాదు. నేను ప్రజలకు సేవ చేయాలని ఎప్పుడూ అనుకోలేదు అని కంగనా తన మనసులోని మాటను బయటపెట్టింది.స్థానిక సమస్యలతో ప్రజలు తన వద్దకు వచ్చిన తీరును కంగనా వివరిస్తూ.. నేను ఎంపీని కదా ప్రజలు అందుకే నా వద్దకు పంచాయతీ స్థాయి సమస్యలతో వస్తున్నారు అని నేను అనుకుంటున్నాను. వాళ్ళు నన్ను చూసినప్పుడు, ఎమ్మెల్యేలకు చెప్పాల్సిన రోడ్లు పాడైపోవడం వంటి సమస్యలను నాకు చెప్పుకుంటున్నారు. అది రాష్ట్ర ప్రభుత్వ సమస్య అని నేను వారికి చెప్తే.. ‘మీకు డబ్బు ఉంది కదా, మీ డబ్బు ఉపయోగించండని అంటారు అని కంగనా తన అనుభవాలను పంచుకుంది.అలాగే తనకు ప్రధాని కావాలనే ఆశయం తనకు లేదని, సామాజిక సేవ తన నేపథ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ స్వార్థపూరిత జీవితాన్ని గడిపానని, పెద్ద ఇల్లు, పెద్ద కారు, వజ్రాలు కావాలని కోరుకునే వ్యక్తిని అని కంగనా పేర్కొన్నారు. కంగనా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఒక ఎంపీగా ఆమె ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను ఇవి ప్రతిబింబిస్తు న్నాయని కొందరు భావిస్తుండగా.. మరికొందరు ఆమె వ్యాఖ్యలపై విమర్శలు గుప్పిస్తున్నారు.

## చదువు పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి : ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, జూలై 9 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాముఖ్యత నివ్వాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం అమీర్‌పేలోని మున్సిపల్ గ్రౌండ్‌లో తలసాని యువసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ స్మారకార్థం బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు సచిన్ రాథోడ్ ఆధ్వర్యంలో ఈ నెల 12 వ తేదీ వరకు నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి విద్యార్థులను ఉత్తేజ పరిచారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు క్రీడల పట్ల కూడా కొంత సమయం కేటాయించడంతో శారీరకంగా, మానసికంగా ఎంతో దృఢంగా తయారవుతారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఏ క్రీడలపట్ల ఆసక్తి ఉందో గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. తమ ప్రతిభను చాటేందుకు ఇలాంటి క్రీడాపోటీలను వేదికలుగా మార్చుకోవాలని చెప్పారు. గడిచిన 9 సంవత్సరాల నుండి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న సచిన్, అతని బృందాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు.సనత్ నగర్ నియోజకవర్గ స్థాయి ఇంటర్ కాలేజ్ లెవెల్ లో జరిగే ఈ పోటీలలో సుమారు



100 టీమ్ లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, శ్రీనివాస్ గౌడ్, బాబా గౌడ్, ప్రకాష్ గౌడ్,సచిన్, రాహుల్, పరమేష్, అబ్రహం, రాకేష్, అర్జున్ తదితరులు ఉన్నారు.

## వంతెన కూలిన ఘటనలో తొమ్మిది మంది మృతి



వడోదర: గుజరాత్ రాష్ట్రంలో ఘోర ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. వడోదర జిల్లాలోని మహిసాగర్ నది పై ఉన్న గంభీర్ వంతెన బుధవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది దీంతో పలు వాహనాలు నదిలో పడిపోయాయి. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య తాజాగా తొమ్మిదికి పెరిగింది.గుజరాత్‌లోని వడోదర–ఆనంద్ పట్టణాలను కలుపుతున్న ఈ వంతెనను 45 ఏళ్ల క్రితం నిర్మించారు. అయితే, చాలా కాలంగా ఈ వంతెన శిథిలావస్థకు చేరినట్లు స్థానికులు తెలిపారు. తాజా ఘటనతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. మరోవైపు ప్రమాద స్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నదిలో పడిన వాహనాలను తొలగించడానికి వడోదర అగ్నిమాపక శాఖ బృందాలు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు చర్యలు తీసుకుంటున్నాయి. మరోవైపు ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ డబుల్ ఇంజిన్ మోడల్ మరోసారి బట్టబయలు..

వంతెన కూలిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ ఘటనతో బీజేపీ డబుల్ ఇంజిన్ మోడల్ మరోసారి బట్టబయలు అయిందని కేటీఆర్ పేర్కొన్నారు.‘మోర్బీ వంతెన కూలి 140 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన విషాదం మరువకముందే, డబుల్ ఇంజన్ బీజేపీ సర్కార్ ఉన్న గుజరాత్ లో మరో వంతెన నదిలో కూలిపోయింది. గుజరాత్‌లో, డబుల్ ఇంజిన్ ఉన్న బీహార్, మధ్యప్రదేశ్‌లలో వంతెనలు వరుసగా ఎందుకు కూలుతున్నాయి..?

## సంపాదకీయం

**గురువారం 10-07-2025**

# కాసిన్ని రొట్టెలు...

'రొట్టెపై కవిత గట్టేంత సాహసం చేయలేను. కాని మిమ్మల్ని ఆ నిప్పుల పొయ్యి వరకూ రమ్మని ఆహ్వానిస్తాను. అక్కడ తినడానికి సిద్ధమవుతున్న రొట్టెను దర్శించమని, ఆ అద్భుతాన్ని తిలకించమని వేడుకుంటాను' అంటాడొక హిందీ కవి. సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, ఆకాశహర్మ్యాలు, విమానం టికెట్టులు, లాకర్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు, మురుగు పొంగితే ఇష్టరీతిన చుట్టుముట్టినట్టు చేరే అసమంజస ధనం... ఇవి కొందరికి అద్భుతంగా తోచవచ్చు. కాని ఆకలిగొన్నవాడికి పొయ్యి మీద కాలుతున్న రొట్టె కంటే అద్భుతమైనది మరొకటి ఉండదు. ప్రతి పూటా అది అపురూపమే. అందుకే కవి అంటాడు 'ప్రతిసారీ ఇంతకు ముందు కంటే మరింత రుచిగా ఉంటుంది. ప్రతిసారీ ఇంతకు ముందు కంటే ఎంతో గుండ్రంగా అగుపిస్తుంది. ఆకలి గురించి అగ్ని పలికే గొప్ప వాంగ్మూలం కదా రొట్టె'....బైబిల్‌లో రొట్టె కేవలం రొట్టె కాదు. జీవితానికి సంకేతం. జీవితానికి ఏమి కావాలి? పంచడం... పంచుకు తినడం తప్ప. 'ప్రభూ... వారిని ఇంటికి వెళ్లమని చెప్పు. వాళ్లు వెళితే వారి వారి రొట్టెలు సంపాదించుకు తినగలరు' అని శిష్యులు ఏసు ప్రభువుకు చెబుతారు. అప్పటికే వారంతా ఎడారి వంటి ప్రాంతంలో ఉన్నారు. ఏసు వెంట ఐదు వేల మంది ఉన్నారు ఆయన ఆరాధనలో. వారంతా ఇళ్లకు వెళ్లి రొట్టెలు ఎప్పటికి తినాలి? 'మన వద్ద ఏం ఉన్నాయి?'... 'ఒక బాలుడి బుట్టలో ఐదు రొట్టెలు, రెండు చేపలు'.... కరుణామయుడి హృదిలో సాటి మనిషి ఆకలి పట్ల ఎంతటి కరుణ ఉంటుందంటే ఆ ఐదు రొట్టెలు, రెండు చేపలే ఐదువేల మందికి సరిపోతాయి. పరిమళా సోమేశ్వర్ రాసిన 'రొట్టె కోసం' అనే కథలో ఆకలిగొన్న పేదబాలుడు ఇంటింటికీ తిరుగుతూ రొట్టె కోసం అంగలారుస్తాడు. ఒక డబ్బున్న మహిళ రోజూ రొట్టెలు చేసి కాకులకు వేయడం వాడికి తెలుసు. ఆ రోజున కాకులకు బదులుగా తను దక్కించుకోవాలని ప్రయత్నిస్తే ఆ మహిళకు ఎంత కోపం వస్తుందో. 'ఛీ... వెధవా' అని తరిమి కొడుతుంది. కాకులకు వేస్తే పుణ్యంగాని ఇలాంటి వెధవలకు వేస్తే ఏం పుణ్యం? వివిన మూర్తి రాసిన 'రొట్టె ముక్క' అనే కథలో కడుపుతో ఉన్న దళితురాలికి రొట్టె ముక్క తినాలని మనసులో పడుతుంది. మినపరొట్టె. ఆ చిన్న కోరిక తీరడం, తీరకపోవడం వెనుక జాతుల దోపిడి అంతా ఉంది.మనుషుల్ని దొంగలుగా మార్చడం రొట్టె ప్రధానంగా చేసే పని. విక్టర్ హ్యూగో ప్రఖ్యాత నవల 'లే మిజరబుల్స్'లో ప్రధాన పాత్ర జీన్ వాల్‌జీన్ రొట్టెను దొంగిలించడంతో ఆ నవల తర్వాతి ఘటనలన్నీ రూపు కడతాయి. జీన్ వాల్‌జీన్ రొట్టెను దొంగిలించింది కుటుంబం ఆకలి తీర్చడం కోసం. గమ్మత్తు ఏమిటంటే ఈ నాగరిక ప్రపంచపు నిర్మాణమంతా రొట్టెను న్యాయంగా దక్కనీకపోవడంపై ఆధారపడి ఉంది. ఇచ్చే చేయి ఒకరిదిగా పుచ్చుకునే చేయి మరొకరిదిగా ఉంచడం వల్ల ప్రపంచంలోని కొద్దిపాటి కుబేర సంతతి బతుకు ఈడ్చగలుగుతుంది. ఈ కుబేరులు కుబేరుల్లా ఉండటానికి మొదట జనానికి రొట్టె లేకుండా చేస్తారు. జనం రొట్టె తినే పరిస్థితిలో ఉంటే గనక యుద్ధాలు తెచ్చి ఇళ్లనూ, వంటగృహాలను ధ్వంసం చేస్తారు. రొట్టెకై అలమటించి జనం చస్తున్న సమయాల్లో కుబేరుల ఇళ్లలోని చలినెగళ్లు మరింత ఎర్రగా నాల్కలు సాచి వెచ్చదనం ఇస్తాయని వారూ వీరూ చెప్పడమే!'తిండి లేని పిల్లలున్న దేశంలో పాలు నల్లగా ఉంటాయి. పిల్లలకు తిండి లేని దేశాల్లో రొట్టెలు రాళ్లలా ఉంటాయి' అని రాస్తాడు వాడ్రేవు చినవీరభద్రుడు. నక్సలైటు పేరుతో అమాయకుణ్ణి తెచ్చి, ఇంటరాగేషన్ పేరుతో నాలుగు రోజులుగా ఆకలికి మాడుస్తుంటే తన వద్ద ఉన్న రొట్టెలను అతడికి రహస్యంగా పెట్టడం గురించి కన్నీళ్లతో రాస్తారు సత్యమూర్తి అలియాస్ శివసాగర్. 'రొట్టె చేసేందుకు రైతు శ్రమిస్తున్నాడు. రొట్టెతో ఆకలి తీర్చుకునే సామాన్యుడు శ్రమిస్తున్నాడు. కాని రొట్టెతో ఆడుకునే పెద్దమనుషులు పెద్దలసభలో కూచుని ఉన్నారే' అని సుధామా పాండే ధూమల్ రాసిన ప్రఖ్యాత కవిత 'రోటీ ఔర్ సన్సద్' ఆలోచనలను రేకెత్తిస్తూనే ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా 80 కోట్ల మందికి రొట్టెగ్రాసం ఇస్తున్నామని చెప్పుకుంటున్న ఈ దేశంలో ఆ స్థితిని యథాతథంగా ఉంచడానికి కారణం తగిన సాహిత్యం పుట్టడానికే కాబోలు. లేకుంటే మనకేం తక్కువ.జూలై 6 నుంచి నెల్లూరులో రొట్టెల పండగ మొదలయ్యింది. అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది పాల్గొని అక్కడి 'బారా షహీద్ దర్గా' వద్ద వున్న చెరువులో మోకాటి లోతున దిగి ఒకరి నుంచి మరొకరు రొట్టెలు మార్చుకుంటారు. ఏం రొట్టెలు అవి? 'సంతానం రొట్టె', 'సౌభాగ్యం రొట్టె', 'ఆరోగ్యం రొట్టె', 'ఉద్యోగం రొట్టె', 'సొంతింటి రొట్టె', 'పెళ్లి రొట్టె', 'చదువు రొట్టె'.... అందరివీ చిన్న చిన్న కోరికలు... చిన్న చిన్న ఆశలు... చిన్న చిన్న ఆకాంక్షలు.... ప్రపంచంలోగాని, ఈ దేశంలోగాని, ఏ నైసర్గికతలోగాని కోటాను కోట్ల సామాన్యులకు ఇంతకు మించిన కోరికలు ఉండవు. వారంతా 'దో వక్త్‌కీ రోటీ' దొరికి జీవితం చీకూ చింతా లేకుండా గడిచిపోతే చాలనే కోరుకుంటారు.ఈ మందభాగ్యులను పాలించడానికి కర్కశత్వం అవసరమా? కరుణ సరిపోదా?

# కార్పొరేట్ రంగానికి కేంద్రం జీహుజూర్!

న్యూఢిల్లీ,కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం, దాని సైద్ధాంతిక భూమిక అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల ప్రకారం కార్పొరేట్ పెట్టుబడిదారీ శక్తుల అనుకూల పరిపాలన సాగిస్తున్నది. 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ అనేక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేయటమేకాకుండా, దానికనుగుణంగా చట్టాలను రూపొందిస్తూ వస్తున్నది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల్ని హరించి వస్తువుల, సర్వీసుల పన్ను (జిఎస్‌టి) చట్టాన్ని తీసుకొచ్చారు. జిఎస్‌టి చట్టం మూలమున రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు మున్సిపాలిటీ స్థాయికి దిగజారిపోయాయి. భారత రాజ్యాంగంలో చెప్పిన ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా ఈ చట్టం ఉన్నది.ఆ తరువాత రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్‌ఆర్‌సి) బిల్లును, ఎన్‌పిఆర్ చట్టాలను తీసుకొచ్చింది. అదేవిధంగా భారత రాజ్యాంగంలో కశ్మీర్‌కు ఇచ్చినటువంటి స్వయం ప్రతిపత్తి 370, 35ఎ ఆర్టికల్స్‌ను రద్దు చేసింది. భారతదేశంలో ఇస్లాం ఫోబియాను రెచ్చగొట్టి మైనారిటీ ముస్లింలపై దారుణ మారణకాండ జరపటం దాని ఉద్దేశం. 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన మరుసటి దినం ఆర్‌ఎస్‌ఎస్ అధినేతలు డా. బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, భారత రాజ్యాంగంగా మనస్మృతి ఉండాలని, అదే తమ అభిమతమని వారు ఉద్ఘాటించారు.భారత రాజ్యాంగ ప్రవేశికలో చెప్పినట్లుగా భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద, ప్రజాతంత్ర, లౌకిక, గణతంత్ర రాజ్యంగా తాము ఒప్పుకోవటం లేదని వారు అనేక సందర్భాల్లో ఘంటాపథంగా చెప్పారు. ఒకే దేశం, ఒకే ప్రజా, ఒకే చట్టం పేరుతో భారతదేశాన్ని హిందూ దేశంగా లేదా హిందూ రాజ్యంగా ఏర్పడాలని ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశమని వారు పదేపదే చెప్పారు. పూర్వం 'జనసంఘ్' రాజకీయ పార్టీయే నేటి 'భారతీయ జనతా పార్టీ'. భారతీయ జనతా పార్టీ ఏర్పడినప్పుడు గాంధీ సోషలిజం తమ లక్ష్యం అన్నారు. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1973) కేసులో సుప్రీం కోర్టు ధర్మాసనం భారత పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరణ చేసే అధికారం ఉన్నదనీ, అయితే పార్లమెంటు చేసే చట్టాలు రాజ్యాంగ మౌలిక స్వభావానికి లోబడి ఉండాలని, భిన్నంగా ఉండరాదని తీర్పు చెప్పింది.ఇటీవల ఆ పార్టీ నాయకులు అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ప్రవేశికలో 'సోషలిస్టు, సెక్యులర్' అనేటువంటి పదాలు లేవని పదేపదే చెబుతున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబాలే బహిరంగ ప్రకటన కూడా ఇచ్చారు. సుప్రీం కోర్టును కూడా ప్రభావితం చేసి బాబ్రీ మసీదు కేసులో తీర్పు వచ్చిన తీరును మనం చూసాం. అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజని గోగోయ్‌కి రాజ్యసభ సభ్యత్వం, మరో సుప్రీం కోర్టు న్యాయమూర్తి నజీర్ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ పదవి పొందారు. భవిష్యత్తులో భారత రాజ్యాంగం మౌలిక స్వభావాన్ని కూడా పార్లమెంటు మార్చవచ్చు అనే తీర్పు వచ్చినా మనం ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. భారతీయ జనతా పార్టీకి మాతృసంస్థ అయినటువంటి రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి హిందూ రాష్ట్ర ఎజెండా ఉన్నది. భారతీయ జనతా పార్టీ ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ ఎజెండాకు అనుగుణంగా పరిపాలన సాగిస్తూ వస్తున్నది. 1991లో పివి నరసింహారావు నేతృత్వంలో తీసుకొచ్చిన లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్ పిజి) నయా ఉదారవాద విధానాలు బిజెపి ప్రభుత్వం మరింతగా అమలు చేస్తున్నది. అంబానీ, అదానీ లాంటి ఆశ్రితపక్షపాతులకు, కార్పొరేట్ దిగ్గజాలకు దేశసంపదను అప్పజెప్పటానికి మొత్తం ప్రభుత్వరంగ పరిశ్రమలన్నిటినీ ప్రైవేటీకరణకు పూనుకున్నది. అందుకనుగుణంగా అనేక చట్టాలను మారుస్తూ వస్తున్నది. అందులో భాగంగానే మూడు వ్యవసాయ నల్లచట్టాలను తీసుకొచ్చి మొత్తం



వ్యవసాయ ఉత్పత్తులన్నిటిని అంబానీ, అదానీలకు వ్యాపార సరుకుగా చేయటానికి పూనుకున్నది. ప్రధాన నరేంద్ర మోడీ అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉంటూ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా భారతదేశ చట్టాలను మారుస్తున్నారు అనే విషయాన్ని మనం ఇక్కడ దృష్టిలో పెట్టుకోవాలి.దీనిని భారతదేశ రైతాంగం, ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం ముందు భాగాన నిలబడి దేశ రాజధాని ఢిల్లీ నగరంలో తిష్ట వేసుకుని ఆ చట్టాలను వెనక్కి తీసుకునేంతవరకు సంవత్సర కాలంపైగా దీర్ఘకాలం పోరాటం చేశారు.ఈ సందర్భంలో రైతు సంఘాలతో చేసుకున్న ఒడంబడికను నేటి వరకు అమలు చేయలేదు. అదే సమయంలో 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను 2020 సంవత్సరంలో తీసుకొచ్చారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ నాటినుండి నేటి వరకు కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాన, వామపక్ష పార్టీల నాయకత్వాన సుదీర్ఘమైన పోరాటంచేస్తూ ఉన్నారు. ఆశ్రితపక్షపాత పెట్టుబడిదారులకు ప్రభుత్వరంగ పరిశ్రమలను, జాతి సంపదను అప్పజెప్పటమే కాకుండా దానికనుగుణంగా గత 100 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయాలనే దుష్టతలంపుతో 29 చట్టాలను రద్దు పరిచి నాలుగు లేబర్ కోడ్‌లను తయారు చేసింది.మొదటిది, 2019 వేతనాల కోడ్ అమలులోకి వస్తే జాతీయ కనీస వేతనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు (పేమెంట్ ఆఫ్ వేజెస్)వేతనాలు నిర్ణయించే అధికారాన్ని కోల్పోతాయి. కనీస వేతనాలు (మినిమం వేజెస్) రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలయ్యే అవకాశం ఉండదు. ఓవర్ టైం చేసినందుకు కానీ, సమాన పనికి సమాన వేతనం గాని కోరే హక్కును కార్మిక వర్గం కోల్పోతుంది. రెండవది, 2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలులోకి వస్తే సమ్మె హక్కు కోసం కార్మిక వర్గం చాలా కష్టాలు ఎదుర్కోవాలి వస్తుంది. ఈ కోడ్‌లో కార్మికులు సమ్మె చేయటానికి అనేక ఆటంకాలు కల్పించారు. 100 మంది కన్నా తక్కువ మంది కార్మిక సంస్థల్లో పని చేస్తుంటే వారిని పైనుండి తొలగించటం సులభతరం అవుతుంది. పరిశ్రమల్లో కార్మిక సంఘాల ఏర్పాటు కష్టభూయిష్టమవుతుంది.మూడవది, 2020 వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ వల్ల పది మంది కంటే తక్కువ కార్మికులు పనిచేసే కంపెనీలలో కార్మికుల ప్రాణాలకు భద్రత ఉండదు. కాంట్రాక్ట్ కార్మికులు రక్షణ కోల్పోతారు. గిగ్, ఫ్లాట్, ఫారం, కార్మికుల రక్షణపై సరైన నిబంధనలు రూపొందించలేనందున వారికి రక్షణ కరువవుతుంది. నాల్గవది, 2020 సామాజిక భద్రత కోడ్ అమలులోకి వస్తే ఎవరికైనా ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చే అవకాశం వస్తుంది. అందువల్ల యాజమాన్యం ఇఎస్ఐ, పిఎఫ్‌లు, గ్రాడ్యుటి కవరేజ్ లేకుండా ఉంటుంది. కార్మికులకు ఏ అవకాశం ఉండదు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే కోటి మంది పైబడిన స్కీం వర్కర్లకి ఈ కోడ్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది.

# కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ చతుర్ముఖ వ్యూహం!




హైదరాబాద్, పదేళ్లు అధికారంలోకి ఉండి.. అమలు చేసిన పథకాలు.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 'బంధు' పథకాలు తమకు గెలుపు సోపానాలు అనుకుంది బీఆర్ఎస్ నాయకత్వం. ఎన్నికల్లో ప్రతిపక్షాల కట్టడికి ఫోన్ ట్యాపింగ్‌తో చేసిన దిగ్భంధం చేశారన్న అరోపణలూ వచ్చాయి. మొత్తంగా తెలంగాణలో మరోసారి తమదే అధికారమన్న ధీమా చూపారు. అయితే ప్రశ్నించే నైజం.. అణచి వేతపై తిరుగుబాటు తత్వం.. స్వేచ్ఛనే శ్వాసగా భావించే తెలంగాణ సమాజం మాత్రం కల్వకుంట్ల కుటుంబం పద్మవ్యూహాలను ఛేదించి, బీఆర్ఎస్ ను ఓడించి, దిమ్మ దిరిగే తీర్పుతో ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ బాట పట్టించారు. స్వతంత్ర భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నిర్భంధాలు, కుట్రలు, జనాకర్షక ఎత్తుగడలకు ఎన్నికల సమరంలో తెలంగాణ సమాజం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామిక విప్లవాలన్నింటిలోనూ విలక్షణమైనదిగా రాజకీయ పరిశీలకులు అప్పట్లోనే అభివర్ణించారు. ప్రజాతీర్పును విశ్లేషించుకుని సరికొత్త విధానాలతో జనాభిమానం కోసం ప్రయత్నించాల్సిన బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం నిత్యం ఏదో రూపంలో ప్రజలే తమను తిరస్కరించి తప్పు చేసినట్లుగా అసహనం వెళ్లగక్కుతుండటం గమనార్హం. ఈ క్రమంలో అధికారం కోల్పోయిన మొదటి నుంచే అధికార కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. తమ ప్రగతి భవన్ పాలన కాలమంతా తెలంగాణ ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి యుగమనట్లుగా.. కాంగ్రెస్ పాలనంతా అవినీతి, అక్రమాలు, అణచివేతల మయమంటూ నిత్యం విమర్శలు గుప్పిస్తున్నారు.

**ఆ ముగ్గురే..**

అధికారంలో ఉన్న మాదిరిగానే.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత.. ప్రభుత్వంపై విమర్శల దాడిలో చట్టసభలలోనూ.. బయట కూడా కనిపిస్తున్నారు. అడపదడపా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఉనికి కోసమన్నట్లుగా ప్రెస్ మీట్ పెడుతున్నారు. పార్టీలో ఆధిపత్య పోరును తలపించేలా.. ఏకంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మరిపించేలా నిత్యం కేటీఆర్, హరీష్ రావు, కవితలు కుదిరితే ప్రెస్ మీట్‌లలో.. లేకపోతే ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై పోటీపడి విమర్శలు కురిపిస్తున్నారు. వారు ముగ్గురితో పాటు బీఆర్ఎస్ సోషల్ మీడియా అటాక్ మరోవైపు నిత్యం కొనసాగుతునే ఉంది. ప్రభుత్వం ఎప్పుడు ఏ తప్పటడుగు వేస్తుందో చూస్తూ వారంతా నలువైపులా విమర్శల దాడి చేస్తున్నారు. ఈ క్రమంలో మరోసారి రైతాంగ సమస్యలపై కేటీఆర్, కవిత, హరీష్ రావులు ఎక్స్ వేదికగా విమర్శలు సంధించారు. కాంగ్రెస్ సర్కార్ పై నిత్యం విమర్శలతో విరుచకపడుతున్న ఆ ముగ్గురి తీరు చూస్తే ఇప్పటికిప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చేయాలన్న తాపత్రాయం కనిపిస్తుందని..కాకపోతే వారి ఆత్రం..ఆరాటం..జనానికి కూడా ఉందని వారు భ్రమపడుతున్నారని విపక్షాలు సైటర్లు సంధిస్తున్నాయి.

**ఇది నో స్టాక్ సర్కార్ : కవిత**

రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై కేటీఆర్, కవిత, హరీష్ రావులు ఎక్స్ వేదికగా విమర్శలు సంధించారు. కవిత తన ఎక్స్ ఖాతాలో ఇది నో స్టాక్ సర్కారు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాజుగా బతికిన రైతును కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రోడ్డు పాలు చేసిందన్నారు. పోలీస్ స్టేషన్లలో ఎరువులు, విత్తనాలు అమ్మిన చరిత్రను రిపీట్ చేసిందని..ఇప్పుడు ఎక్కడ చూసినా యూరియా కోసం భారీ క్యూ లైన్లే కనిపిస్తున్నాయని విమర్శించారు. యూరియా మాత్రమే కాదు డీఏపీ, పొటాష్ కోసమూ రైతులకు తిప్పలు పడుతున్నారని.. ముగ్గురు మంత్రులున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల పరిస్థితి మరీ ఘోరం అన్నారు.వానాకాలం సీజన్ మొదలై నెల రోజులు గడిచిన తర్వాత కూడా ఎరువుల కొరత రైతులను వేధిస్తున్నది అంటే సర్కారు ముందు చూపులేని తనం ప్రణాళికబద్ధంగా వ్యవహరించకపోవడమే కారణం అని ఆరోపించారు.

**కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఎరువుల కరువు : కేటీఆర్**

కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా లేదు, రైతు రుణమాఫీ లేదని..కనీసం అప్పు తెచ్చి వ్యవసాయం చేద్దామంటే ఆఖరికి ఎరువులకు కూడా కరువొచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. మీరు అడిగినట్టు ఆధార్ కార్డులు ఇచ్చినా, రైతుకి కనీసం బస్తా ఎరువు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఎందుకుంది? అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఎందుకుందని రైతులకు వివరించాలన్నారు కేటీఆర్. రూ.266.50 ఉండాల్సిన బస్తా యూరియా ధర ఇప్పుడు రూ.325 ఎలా అయ్యిందో రైతులకే కాదు రాష్ట్ర ప్రజలకు మొత్తం తెలియలన్నారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాను దగ్గరుండి నడిపిస్తుంది ఎవరు?..ఈ కృత్రిమ కొరత ఎవరివల్ల ఏర్పడుతుందో, ఆఖరికి ఎరువులను కూడా బుక్కేస్తున్న మేతన్నలు ఎవరో వెంటనే విచారణ జరిపించాలన్నారు.

**కేసీఆర్ పాలనే రైతన్నకు భరోసా: హరీష్ రావు**

కేసీఆర్ పదేళ్ల పాలనే రైతాంగానికి భరోసా కాలమని..వ్యవసాయం పండగలా మారిందని మాజీ మంత్రి టి.హరీష్ రావు ఎక్స్ వేదికగా గుర్తు చేశారు. పదేళ్లలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు సాయం, రైతు రుణమాఫీ, యూరియా, నాణ్యమైన విత్తనాల సరఫరా, రైతువేదికల నిర్మాణం, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు, పెరిగిన భూగర్భ జలాలు.. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరాతో పాటు రైతు కుటుంబాల సభ్యులకు అందిన సంక్షేమ పథకాలతో రైతులకు మేలు జరిగిందని వివరించారు.

## మదనపల్లె దస్త్రాల దహనం కేసులో ఆర్డీవో అరెస్ట్

మదనపల్లె,అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన దస్త్రాల దహనం కేసులో మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.అనంతరం సుప్రీంకోర్టు ఆదేశానుసారం బెయిల్‌పై విడుదల చేశారు.

# హైవేలపై నిత్యకృత్యంగా ప్రమాదాలు

విజయవాడ,ఈ మధ్యరోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నాలుగు వరసల రోడ్లపైనా ప్రమాదాలు తప్పడం లేదు. అతివేగంతో పాటు, మలుపులు, సరైన సూచికలు లేకపోవడం, రోడ్ల మరమ్మత్తుల చేపట్టక పోవడంకూడా కారణంగా చెప్పుకోవాలి. ఎపిలోని పలు రోడ్లు మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. తిరుపతి. ప్రకాశం, విజయనగరం, నెల్లూరు ఇలా ప్రతిచోటా ప్రమాదాలు నిత్యకృత్య మయ్యాయి. వీటితో పాటు కర్నూలు హైవే మృత్యుమార్గమైంది. తరచూ హైవే ప్రమాదాలు జిల్లాలో మామూలయ్యాయి. తరచూ ఎక్కడో ఒక చోట ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఘటన జరిగినప్పుడు తప్ప మళ్లీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో అధికారులు పట్టించుకోవడం లేదు. హైవేపై వేగం నియంత్రణ నిబంధనలు పాటించక పోవడమే దీనికి కారణం. దీంతో భద్రత లేమి స్పష్టంగా కనిపిస్తోంది. అంతులేని వేగంతో వాహనాలు దూసుకెళ్లి రోడ్డు పైన నెత్తురు చిందుతున్నాయి. రహదారి నిబంధనలేవీ అమలు కావడం లేదు. ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వెల్దుర్తి, డోన్, ప్యాపిలి ప్రాంతాల్లోని హైవేలో ఉన్న రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లుగా మారిపోయాయి. జిల్లాలో 85 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్-44 ఉంది. కర్నూలు నుంచి వెల్దుర్తి, డోన్, ప్యాపిలి మీదుగా పోదొడ్డి వరకు జిల్లా హైవే రహదారి ఉంది. ఈ ప్రాంతాల్లోని రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లయ్యాయి. డోన్ పరిధిలో ఆరు హైవే కూడళు ప్రమాదాల నిలయాలయ్యాయి. హైవేపై అతివేగంగా వాహనాలు దూసుకొస్తున్నాయి. నిబంధనల ప్రకారం హైవేపై వాహనాల వేగం 80 కిలోమీటర్లు మించరాదు. అయితే ఈ నిబంధనను వాహనాల డ్రైవర్లు అసలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, వాహనాలు మితిమీరిన వేగంతో వస్తున్నాయి. హైవేపై వేగనియంత్రణ చేయాల్సిన ఎంవీఐ అధికారులు, హైవే అధికారులు మొద్దునిద్ర వీడటం లేదన్న విమర్శలున్నాయి. హైవేపై వాహనాల వేగాన్ని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవలసివస్తోంది. హైవే అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. హైవేపై పాటించాల్సిన నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. హైవే మలుపుల వద్ద ప్రమాద సూచికబోర్డులు అసలు కనిపించడం లేదు. మలుపుల వద్ద వేగనియంత్రణ బోర్డులు అడ్రస్ లేవు. వీటికి తోడు హైవే జంక్షన్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో.. వాహనాలు వేగంగా దూసుకొస్తున్నాయి. అదే విధంగా హైవే జంక్షన్‌ల వద్ద తప్పనిసరిగా లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రిళ్లు హైవే జంక్షన్‌ల వద్ద లైటింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

# హిమాచల్‌లో వరదలతో అతలాకుతలం

సిమ్లా,హిమాచల్‌లో కురుస్తోన్న భారీ వర్షాలతో మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. కాగా.. రుతుపవనాల రాకతో జూన్ 20 నుంచి కురుస్తున్న వర్షాలకు హిమాచల్‌లో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురి ఆచూకీ గల్లంతయిందని రాష్ట్ర విపత్త నిర్వహణ విభాగం వెల్లడించింది. భారత వాతావరణ విభాగం రాష్ట్రంలోని పది జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇదిలాఉంటే.. మండి జిల్లాలోని తునాగ్ ప్రాంతంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌ను వరద నీరు ముంచెత్తిన సంగతి తెలిసిందే. అందులో ఉన్న బంగారం, నగదు ఏమైందో..? అని ఆందోళన వ్యక్తమవుతోంది. దాంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు కొట్టు-కొనిపోకుండా, దొంగల చేతిలో పడకుండా గ్రామస్థులు కాపలా కాస్తున్నారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో హిమాచల్ ప్రదేశ్ ప్రజల జీవితం దుర్భరంగా మారింది. ఎంతోమంది అయినవాళ్లను కోల్పోయి అనాథలుగా మారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక కుక్క అరుపు.. 67 మంది ప్రాణాలను కాపాడింది. అక్కడి సియతి గ్రామంలో జూన్ 30న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెద్ద కొండచరియ విరిగిపడింది. ఆ గ్రామస్థుడు ఒకరు మాట్లాడుతూ.. 'మా ఇంటి రెండోఅంతస్తులో ప్రతిరోజు ఓ శునకం నిద్ర పోతుంది. అయితే ఆరోజు ఉన్నట్టుండి అది విపరీతంగా అరవడం మొదలుపెట్టింది. మరోవైపు కుంభవృష్టి వర్షం కురుస్తోంది. ఆ అరుపుల శబ్దానికి నేను లేచి దాని దగ్గరకు వెళ్లాను. పైకి వెళ్లగా ఇంటిగోడకు పగుళ్లు కనిపించాయి. ఇంట్లోకి నీరు రావడం మొదలైంది. దాంతో వెంటనే కుక్కను కూడా కిందికి తీసుకెళ్లి, అందరినీ నిద్ర లేపాను. ఇంటి చుట్టుపక్కల వాళ్ల ఇళ్లకు వెళ్లి వారిని కూడా లేపి, సురక్షిత ప్రాంతానికి వెళ్లమని చెప్పాను. అలా దూరంగా వెళ్లామో, లేదో.. మా గ్రామంపై కొండచరియ విరిగిపడింది. పదుల సంఖ్యలో ఇళ్లు దానికింద నేలమట్టం అయ్యాయి. ఒక నాలుగైదు ఇళ్లు మాత్రం దెబ్బతినకుండా కనిపించాయని ఆయన వెల్లడించారు. ఇళ్లు ధ్వంసం కావడంతో గ్రామస్థులంతా తియంబాలా గ్రామంలోని నైనాదేవి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. సర్వం కోల్పోవడంతో అంతా నిరాశలో మునిగిపోయారు. కొందరు హైబీపీతో బాధ పడుతున్నారు.

# ఎక్కడికి వెళ్లిన మనుషులను చంపడమేనా

నెల్లూరు, ప్రతిపక్షంలో ఉన్నా మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిలో మార్పు రాలేదని, ఇప్పటికీ హెలికాప్టర్లలోనే తిరుగుతున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సోమవారం నెల్లూరు పట్టణ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతలతో మంత్రి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా మనుషుల్ని చంపుకుంటూ వెళ్తున్నారని.. పల్నాడు జిల్లా పర్యటనలో ఒకరిని పరామర్శించడానికి వెళ్లి ముగ్గురిని చంపారని మండిపడ్డారు. 'జనసమీకరణ మనం చేయలేక కాదు.. మనవల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదు. కార్యకర్త కారు కిందపడితే కనీసం దిగి చూడలేదు. దిగి చూసి ఆసుపత్రికి పంపించి ఉంటే బతికేవాడు. బాధిత కుటుంబం తల్లిని తీసుకువచ్చి కనీసం కూర్చోపెట్టలేదు. గ్లాస్ మంచినీరు అయినా ఇచ్చారా? సొంత కార్యకర్త చనిపోతే నిల్చొని రెండు భుజాలు తట్టి వెళ్లిపోయారు' అంటూ ఫైర్ అయ్యారు. వైసీపీ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. బ్లేడ్ బ్యాచ్‌ను, గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్ హయాంలోనే 164 మంది కార్యకర్తలను చంపారని.. అప్పుడే భయపడలేదని.. రప్పా, రప్పాకు భయపడతామా అని అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు ఇంటి గేటుకు తాళ్లు కట్టారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరి-కై-నా తిరిగే హక్కు ఉందన్నారు. కానీ తిరగమంటే మనుషులను చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించమంటే ఎదురుదాడి చేస్తున్నారన్నారని మంత్రి లోకేష్ ఫైర్ అయ్యారు.

# డాలర్ దెబ్బకు రూపాయి విలవిల..రూపాయిని నిలబెట్టే మార్గమేదీ ?



ముంబయి, అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు పతనం అవుతోంది. అమెరికా బెదరింపులతో ఇప్పుడు అన్ని రంగాల్లో దెబ్బతినేలా ఉంది. ట్రంప్ సుంకాల వల్ల రానున్న రోజుల్లో డాలర్ మారకం మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదు. ఇది మరింతగా అగాథంలోకి పడిపోతోంది. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా డాలర్ విలువ రూ.85.67కు చేరువయ్యింది. రికార్డు స్థాయికి చేరిన మన విదేశీ మారక నిల్వలు ఇప్పుడు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. రూపాయి అదుపునకు ఆర్బీఐ యధేచ్ఛగా డాలర్లను వెదజల్లడం, విదేశీ ఇన్వెస్టర్లు డాలర్లను తరలించుకుపోవడంతో ఇప్పుడు మన వద్ద ఫారెక్స్ నిల్వలు కరిగిపోతున్నాయన్న ఆందోళన కూడా ఉంది. విదేశీ దిగుమతులు కూడా డాలర్‌ను బలోపేతం చేస్తున్నాయి. ఇలా ఒకదాని వల్ల మరొకటి పెరిగిపోవడం, తద్వారా రూపాయి మరింత క్షీణించడం, ధరలు ఆకాశాన్నంటడం చకచకా జరిగిపోతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆల్‌టైం రికార్డ్ గా చూడాలి. డాలర్ మారకంలో రూపాయి విలువ రికార్డు కనిష్టస్థాయికి పడిపోయి రూ.85.67 వద్ద డాలర్ మారకం కొనసాగుతున్నది. కరెన్సీ పతనంతో పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, పప్పులు తదితరాల ధరలన్నీ ఆకాశాన్ని తాకాయి. రూపాయి పతనాన్ని నిలువరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేకుండాపోయింది. 2014కు ముందు బిజెపి అధికారంలోకి రాకముందు.. డాలర్‌తో రూపాయి విలువ 68కి పడిపోతే నరేంద్ర మోడీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఐసియులో పడిపోయిందని.. తాము అధికారంలోకి వస్తే దేశీయ కరెన్సీని ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకునేలా చేస్తామని అనేక గొప్పలు చెప్పారు. ప్రస్తుతం అంతకంటే దారుణమైన స్థితిలోకి రూపాయి పడిపోతున్నప్పటికీ.. కట్టడి చర్యలు కానరావడం లేదని నిపుణులు విమర్శిస్తున్నారు. దేశీయ గణంకాలు బలహీనంగా చోటు చేసుకో వడానికి తోడు అంతర్జాతీయం గా డాలర్ విలువ పెరగడం రూపాయిని ఒత్తిడికి గురి చేసిందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుత ఏడాది జూన్‌లో భారత ఎగుమతుల కంటే దిగుమతులు అధికంగా చోటు చేసుకోవడం.. రికార్డ్ స్థాయిలో వాణిజ్య లోటు పడటంతో రూపాయిపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది. డాలర్‌తో రూపాయి విలువ ఇంతటితోనే ఆగుద్దని అనుకోవడానికి లేదని ఆర్థికనిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌లోనూ మందగమన భయాలు, అధిక చమురు ధరలు, అంతర్జాతీయ ప్రతికూల అంశాలు, ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడం, ఆర్‌బిఐ వద్ద మారకం నిల్వలు తగ్గిపోవడం తదితర అంశాలు రూపాయిని కుదేలు చేస్తున్నాయి. రూపాయి పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో దిగుమతి ఆధారిత అనేక ఉత్పత్తుల ధరలు భారీగా పెరగనున్నాయి. చమురు ధరలు ఎగిసిపడనున్నాయి. అధిక ధరలతో ఇప్పటికే ప్రజలు తీవ్ర బెంబేలెత్తుతున్నారు. విదేశీ అప్పులు తీవ్ర భారం కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపనుంది. ద్రవ్యోల్బణం ఎగిసిపడనుంది. వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడనుంది. ఈ చర్యలను కట్టి చేసేందుకు ఆర్థిక ప్రణాళికలు అవసరం. విదేశాల నుంచి దిగుమతలుపై కఠిన ఆంక్షలు విధించాల్సిందే. అలాగే మన పంట విధానాలను సమీక్షించి ఎగుమతులను ప్రోత్సహించాలి. కరెంట్ ఖాతా లోటు, వాణిజ్య లోటు వాటి లోతెంతో చూపిస్తున్నాయి. విదేశీ రుణం పెరిగి పోయింది. రూపాయి నిలువునా పతనమయ్యింది. వీటికి తోడు చమురు, పెట్రో కంపెనీలపై రూ.లక్ష కోట్ల ఆదాయాన్ని తెచ్చేందుకు పన్నులు వడ్డించారు. బంగారం పై సుంకాలు వేసి ధరలు పెంచేశారు. జీఎస్టీ మినహాయింపులో ఉన్న నిత్యావసరాలపై కూడా పన్ను వేశారు. ఆర్థిక మంత్రి చెప్పినట్టు కేంద్ర ప్రభుత్వానికిది ఇప్పుడు అసాధరణ పరిస్థితే. ఆర్థిక వ్యవస్థను ఎలా గాడిన పెట్టాలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. వచ్చే కొద్ది నెలల్లో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మాంద్యంలో చిక్కుకొంటే, భారత ఆర్థిక వ్యవస్థ సైతం తీవ్ర సంక్షోభంలోకి జారుకొంటుందని విశ్లేషకులు అంటున్నారు. బ్యాంకింగ్, కరెన్సీ, రుణ సంక్షోభాలు ముంచెత్తుతాయని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. కేంద్ర తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే వృద్ధి రేటు కుప్పకూలు తుందని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు.

# నల్లపురెడ్డిని చివరకు జగన్ కూడా ఛీ కొట్టినట్టేనా?



అమరావతి,వైసీపీ నేత, మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిని కొంతమంది ధ్వంసం చేశారు. ఇంట్లో కనపడిన వస్తువుని కనపడినట్టు విరగ్గొట్టారు. చివరకు కారుని కూడా తిరగతిప్పి అవతలపడేశారు. ఇటీవల కాలంలో ఏపీలో ఎవరి ఇంటి మీద కూడా ఈ స్థాయిలో దాడి జరగలేదంటే అతిశయోక్తి కాదు. అయితే ఈ ఘటనపై వైసీపీ నేతల్లో స్పందన అంతంతమాత్రంగానే ఉంది. సాక్షాత్తూ జగన్ కూడా నేరుగా స్పందించలేదు. నల్లపురెడ్డికి ఫోన్ చేసి దాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారని సాక్షి మీడియాలో వార్తలిచ్చారు కానీ, జగన్ ఆ దాడిని ఖండించారని, రెడ్ బుక్ పేరెత్తి కూటమి పాలనను విమర్శించారని కూడా ఎక్కడా లేదు. పోనీ జగన్ ఏమైనా అజ్ఞాతంలో ఉన్నారా అంటే అదీ కాదు. ఆయన ఇడుపులపాయలో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మీడియాకు దగ్గరగానే ఉన్నారు. కానీ నల్లపురెడ్డి గొడవపై ఆయన స్పందించలేదు. కారణం ఒక్కటే. అక్కడ ప్రసన్న చేసిన తప్పు స్పష్టంగా కనపడుతోంది. ప్రసన్న వ్యాఖ్యలకు అది కరెక్ట్ సమాధానం అని సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. ఇలాంటి టైమ్ లో ప్రసన్న కుమార్ రెడ్డికి మద్దతుగా జగన్ మాట్లాడి ఉంటే కచ్చితంగా ఆ తప్పుని ఆయన సపోర్ట్ చేసినట్టవుతుంది. అందుకే జగన్ సైలెంట్ అయ్యారు. ప్రసన్న నీచపు వ్యాఖ్యల్ని పరోక్షంగా తప్పుబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎక్కడ ఏ దాడి జరిగినా దాన్ని రెడ్ బుక్ కి లింక్ పెడుతూ మాట్లాడేవారు. వైసీపీ నేతలపై ఎవరు దాడి చేసినా, అది కూటమి ప్రోద్బలంతో జరిగిందేనని విమర్శించేవారు. కానీ మాజీ మంత్రి ఇంటిపై జరిగిన దాడి విషయంలో మాత్రం జగన్ ఇంకా నోరు తెరవకపోవడం ఇక్కడ విశేషం. పొరపాటున నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని జగన్ సమర్థిస్తూ మాట్లాడితే జనంలో తీవ్ర వ్యతిరేకత వస్తుందని ఆయనకు అర్థమైంది. ఇప్పటికే అమరావతి మహిళల విషయంలో తప్పుడు వ్యాఖ్యలు వైసీపీకి తిప్పలు తెచ్చాయి. ఆ తర్వాత కవర్ చేసుకోలేక నానా తంటాలు పడ్డారు. ఇప్పుడు మరోసారి మహిళను, స్వయానా మహిళా ఎమ్మెల్యేను కించపరిచేలా మాట్లాడారు వైసీపీ నేత. దీంతో ఆ వ్యాఖ్యలను సమర్థించేందుకు ఎవరూ సాహసించట్లేదు. వైసీపీ స్థానిక నేతలు మాత్రం రచ్చ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇంకెవరూ ఆయన్ను సమర్థిస్తూ ప్రెస్ మీట్లు పెట్టలేదు.

ప్రశాంతి రెడ్డి స్పందన..

రాజకీయంగా తనను ఎదుర్కోలేక ప్రసన్న కుమార్ రెడ్డి తనను అసభ్య పదజాలంతో దూషించారని, ఇలాంటి సంస్కారం లేని నాయకుడిని ప్రజా జీవితం నుంచి బహిష్కరించాలని అన్నారు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. తనపై చేసిన వ్యాఖ్యలకు గాను ప్రసన్నపై ఆమె నెల్లూరు జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇంటిపై జరిగిన దాడికి తమకు సంబంధం లేదని, సింపతీ కోసమే ఆయనే దాడి చేయించుకుని ఉంటారని మండిపడ్డారు.

ఇది జంగిల్ రాజ్ కాదు..


వైసీపీ నాయకులకు మహిళలంటే ఇంత ద్వేషభావమా? అంటూ మంత్రి నారా లోకేష్ ట్వీట్ వేశారు. పెద్ద పెద్ద చదువులు చదివితే సరిపోదని, కనీస ఇంగితజ్ఞానం ఉండాలని ఆయన చెప్పారు. తల్లి, చెల్లిని తరిమేసిన అధినేత జగన్ ని ఆ పార్టీ నేతలు ఆదర్శంగా తీసుకున్నరని మండిపడ్డారు. మహిళల జోలికి వచ్చినా, ఆడవారిపై అవాకులు చెవాకులు పేలినా ఊరుకునేందుకు ఇది జగన్ జంగిల్ రాజ్ కాదన్నారు లోకేష్.

నోటి వదరు..

మహిళలను కించపరచే నోటి వదరు ఆ పార్టీని వదల్లేదంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ ఘటనపై ఘాటుగా స్పందించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వైసీపీ నేత ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు పవన్. ఆ వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవి అని ఆ మాటలకి సభ్య సమాజం సిగ్గుపడుతుందన్నారు. మహిళల వ్యక్తిత్వాన్ని అవహేళన చేస్తూ కించపరచే వ్యాఖ్యలు చేయడం వైసీపీ నాయకులకు ఒక అలవాటుగా మారిపోయిందన్నారు. మహిళలను కించపరచడాన్ని ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలన్నారు పవన్. మహిళల గౌరవానికి భంగం కలిగించినా,అసభ్య వ్యాఖ్యలు చేసినా చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడూ వైసీపీ నేతలు నోటి వదరుతో అసభ్యంగా వ్యాఖ్యలు చేశారని, నిండు శాసనసభలో కూడా అలానే మాట్లాడటంతో గత ఎన్నికల్లో ప్రజలు సరైన రీతిలో తీర్పునిచ్చారని గుర్తు చేశారు పవన్. అయినా వారికి బుద్ధిరాలేదని, మహిళా సమాజం ఆ పార్టీకి తగిన విధంగా సమాధానం చెబుతుందన్నారు.

# చంద్రబాబుతో టాలీవుడ్ కటీఫ్?

లెక్కప్రకారం ఈపాటికి చంద్రబాబుతో టాలీవుడ్ ప్రముఖుల భేటీ జరగాలి. ఆ మీటింగ్ ఎందుకు ఆగిపోయిందనేది బహిరంగ రహస్యం. మంత్రి దుర్గేష్ ఓ లిస్ట్ తయారుచేశారు, దానికి పవన్ కల్యాణ్ తనదైన మార్పుచేర్పులు చేసినట్టు ప్రచారం జరిగింది. ఇంత జరిగిన తర్వాత కూడా ఆ లిస్ట్‌లో ఉన్న కొంతమంది చంద్రబాబును కలిసేందుకు ఆసక్తి చూపించలేదు. షూటింగ్స్‌లో బిజీగా ఉన్నామంటూ కబురు పంపించారు. మిగిలిన వాళ్లలో కొంతమందిని కలిసేందుకు చంద్రబాబు ఆసక్తి చూపించలేదని సమాచారం. అందుకే అపాయింట్‌మెంట్ ఇచ్చి మరీ రద్దు చేసుకున్నారు చంద్రబాబు. అలా ఆగిన భేటీ, ఆ తర్వాత మళ్లీ కార్యరూపం దాల్చలేదు. ఇక్కడ గమనించాల్సిన అంశం, అండర్‌లైన్ చేయాల్సిన విషయం ఏంటంటే.. స్వయంగా డిప్యూటీ సీఎం, టాలీవుడ్ టాప్ హీరో పవన్ కల్యాణ్ చెప్పిన తర్వాత కూడా ముఖ్యమంత్రితో భేటీకి ఎవ్వరూ ఆసక్తి చూపించలేదు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటివరకు టాలీవుడ్ నుంచి రిప్రజెంటేషన్ జరగలేదనేది పవన్ కల్యాణ్ బాధ. తన ఆవేదనను, కోపాన్ని ఏకంగా ఆయన ప్రెస్ నోట్ రూపంలో వెళ్లగక్కారు ఆమధ్య. ఇంత జరిగినప్పటికీ టాలీవుడ్ నుంచి కనీస స్పందన లేదంటే ఏమనుకోవాలి? పవన్ కల్యాణ్ చెప్పినప్పటికీ టాలీవుడ్ జనం పట్టించుకోకపోవడం కాస్త వింతగానూ, ఆలోచించాల్సిన అంశంగాను తోస్తోంది. ఇంతకీ రాబోయే రోజుల్లోనైనా టాలీవుడ్ ప్రముఖులతో చంద్రబాబు భేటీ ఉంటుందా? దాదాపు ఉండకపోవచ్చనేది ఇండస్ట్రీ ఇన్ సైడ్ టాక్. గతంలో మీటింగ్ కోసం స్వయంగా మంత్రి, ఫోన్లు చేసి కొంతమందిని ఆహ్వానించారు. మంత్రి నుంచి పిలుపు రాని వాళ్లు ఎలాగూ రారు, తమ అసంతృప్తిని కూడా వాళ్లు ఇదివరకే వెళ్లగక్కారు. ఆ సంగతి పక్కనపెడదాం. మరి స్వయంగా మంత్రి నుంచి పిలుపు అందుకున్నవాళ్ల సంగతేంటి? వాళ్లు ఎగనామం పెట్టడం వెనక ఆంతర్యం ఏంటో వాళ్లకే తెలియాలి. చంద్రబాబు మీద వ్యతిరేకతా? లేక పవన్ కల్యాణ్ ను ముఖాముఖి కలవాల్సి వస్తుందని అయిష్టతా..? మనకెందుకులే, డ్రాప్ అవుదాం, వెళ్లేవాళు వెళ్తారు అనే ఉదాసీనతా..? కారణం ఏదైనా కలవాల్సిన వాళ్లు కలవడానికి ఇంట్రెస్ట్ చూపించలేదు, అలాంటి వాళ్లు ముందుకు రాకపోవడంతో మీటింగ్ జరగలేదు. ఎవరైతే ఇండస్ట్రీలో యాక్టివ్‌గా ఉండి సినిమాల్లో నటిస్తున్నారో, సినిమాలు డైరెక్ట్ చేస్తున్నారో, సినిమాలు నిర్మిస్తున్నారో.. వాళ్లు వెళ్లి కలిస్తే బాగుంటుందనేది దిల్ రాజు భావన. ఈ మేరకు ఆయన తనవంతు ప్రయత్నం చేశారు. అంతా కలిసొస్తే మీటింగ్ కు వెళ్దామంటూ ఓ అడుగు ముందుకేశారు. కానీ మెజారిటీ వ్యక్తులు మీటింగ్‌కు రావడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. ఏపీ ప్రభుత్వం నుంచి 4 రోజుల ముందే పిలుపు వచ్చినప్పటికీ, షూటింగ్స్ బిజీ వల్ల రాలేకపోయామని కొందరు చెప్పడం, అయిష్టతను పరోక్షంగా వెల్లడించడమే. ముఖ్యమంత్రి మీటింగ్ కు షూటింగ్ అడ్డంకి అవుతుందా? ఈ విషయాలన్నీచంద్రబాబుకు చేరాయి. ఇండస్ట్రీ జనాల పోకడ ఎలా ఉందో ముఖ్యమంత్రి కూలంకుషంగా తెలుసుకున్నారు. ఇకపై టాలీవుడ్ జనాలకు, సినిమా అంశాలకు దూరంగా ఉండడమే మంచిదనే అభిప్రాయానికి చంద్రబాబు వచ్చినట్టు తెలుస్తోంది. ఏమైనా ఉంటే పవన్ కల్యాణ్‌కు ఎటాచ్ చేసి తను తప్పుకోవాలని సీఎం దాదాపు ఓ కృతనిశ్చయానికి వచ్చినట్టు సమాచారం.




నంది అవార్డుల వేడుకపై నీలినీడలు..

ఇదే కనుక జరిగితే ఆంధ్రప్రదేశ్ లో ప్రకటించాల్సిన నంది అవార్డుల అంశం అగమ్యగోచరంగా మారడం ఖాయం. తెలంగాణలో ఎప్పుడైతే గద్దర్ ఫిలిం అవార్డుల వేడుక జరిగిందో, రేపోమాపో ఏపీ ప్రభుత్వం కూడా నంది అవార్డులపై విస్పష్ట ప్రకటన చేస్తుందని అంతా అనుకున్నారు. నిజానికి టాలీవుడ్ డెలిగేషన్ వెళ్లి సీఎంను కలిస్తే, అందరూ ఊహించినట్టుగానే అవార్డుల ప్రకటన ఈపాటికి వచ్చి ఉండేది. కానీ ప్రభుత్వానికి, టాలీవుడ్‌కు మధ్య గ్యాప్ పెరిగింది. పవన్ కల్యాణ్ లాంటి హీరో ప్రభుత్వంలో కీలకమైన పొజిషన్‌లో ఉండి కూడా ఈ గ్యాప్ రావడం విచిత్రం. ప్రస్తుతం టాలీవుడ్‌లో సిచ్యుయేషన్ ఎలా ఉందంటే, ఎవ్వరూ ఆ మీటింగ్ గురించి చర్చించడం కాదు కదా, కనీసం ఆలోచించడం కూడా మానేశారు. ఇప్పుడీ అంశంపై కదలిక రావాలంటే ఒకటే మార్గం. ఎవరెవరికి ఆహ్వానాలు అందాయి, అందులో ఎవరు తిరస్కరించారనే లిస్ట్ బయటపెడితే సరి.

# హైడ్రా ఫాతిమా కాలేజీ పట్ల ఎందుకు మెతక వైఖరి అవలంబిస్తోంది..?



హైదరాబాద్,అయితే ఫాతిమా కాలేజీకి సంబంధించి ఈ క్రింది అంశాలు పరిగణనలోకి తీసుకోబడ్డాయి. అవేంటంటే..

-ఫాతిమా ఓవైసీ ఉమెన్స్ కాలేజ్ అనేది అక్బరుద్దీన్ ఓవైసీచే పేద ముస్లిం మహిళల కోసం కేజీ నుంచి పీజీ వరకు నడపబడుతున్న విద్యాసంస్థ.

- ఈ కాలేజీలో ఎలాంటి ఫీజులు తీసుకోరు. లేదా చాలా తక్కువ ఫీజులు వసూలు చేస్తారు. ఇది పూర్తిగా స్వచ్ఛంద సంస్థ ద్వారా లాభాపేక్ష లేని పద్ధతిలో నడుస్తుంది.

- ఇక్కడ 10,000 మందికి పైగా పేద ముస్లిం బాలికలు/మహిళలు ప్రతీ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు.

-ఇటువంటి కళాశాలలు సామాజికంగా చాలా ముఖ్యమైన ప్రయోజనాన్ని అందిస్తాయి, ఎందుకంటే అవి పేద ముస్లిం మహిళలను సామాజిక వెనుకబాటుతనం నుండి విముక్తి చేస్తాయి.

- ముఖ్యంగా ముస్లింల వంటి వెనుకబడిన వర్గాల మహిళలకు అందించే ఏ విద్య అయినా ముస్లిం సమాజం అభివృద్ధికి ఖచ్చితంగా దారితీస్తుంది. ఇది వెనుకబడిన ముస్లిం కుటుంబాల అభివృద్ధికి, అంతిమంగా దేశానికి కూడా ప్రయోజనం చేకూరుస్తుంది. దేశానికి సంబంధించిన ఈ పెద్ద చిత్రాన్ని మనం విస్మరించకూడదు.

- చిన్నచిన్న రాజకీయాలతో కొట్టుకుపోయి బలమైన 'భారత్' ఆవిర్భావంపై రాజీ పడకూడదు.

ఇప్పుడు, HYDRAA ని విమర్శించే వారు తక్షణమే అడిగే ప్రశ్న ఏమిటంటే, అది MIM పట్ల ఉద్దేశపూర్వకంగా మెతక వైఖరిని అవలంబిస్తోందని, 'విముక్తి' అనే కొత్త సిద్ధాంతాన్ని ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తోందనిఅయితే, MIM నాయకులు/ఎమ్మెల్యేలు చేసిన కొన్ని ఆక్రమణ ప్రయత్నాల పట్ల HYDRAA చాలా కఠినంగా వ్యవహరించింది. గత సంవత్సరం ఆగస్టు 8న HYDRAA చేసిన మొదటి కూల్చివేత, నేషనల్ పోలీస్ అకాడమీ, శాస్త్రిపురం, శివరాంపల్లి, హైదరాబాద్ సమీపంలోని బమ్ రుక్న్ ఉద్ దౌలా లేక్ లోని భవనాలు, ఆక్రమణలు. MIM ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు నిర్మించిన భారీ భవనాలు కూల్చివేయబడ్డాయి. ఈ 25 ఎకరాల సరస్సును ప్లాట్లుగా మార్చి, MIM ఒవైసీ కుటుంబానికి చాలా ముఖ్యమైన వ్యాపార భాగస్వామి అయిన కింగ్స్ గ్రూప్ విక్రయిస్తోంది. ఇక్కడ ఒక్కో ఎకరం ఖరీదు రూ. 40 కోట్లు. కాబట్టి, ఈ సరస్సు ఆస్తి విలువ రూ. 1000 కోట్ల కంటే ఎక్కువ. HYDRAA ఇప్పుడు ఈ సరస్సును అభివృద్ధి చేస్తోంది. ఆక్రమణదారులు హైకోర్టు నుండి స్టే ఆర్డర్‌లతో చట్టపరమైన అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నించినప్పటికీ, HYDRAA సరస్సు అభివృద్ధి పనులను బలవంతంగా కొనసాగిస్తుంది. ఈ 25 ఎకరాల భూమి ఇప్పుడు తవ్వి, 24/7 చెరువు పనులు జరుగుతున్నాయి. HYDRAAఅధికారులు హైదరాబాద్ పాతబస్తీలోని సరస్సు అభివృద్ధి పనులను దగ్గరగా వుండి, వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. అదేవిధంగా.. ఇటీవల జరిగిన కూల్చివేతలో, HYDRAA చంద్రాయణగుట్ట (ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అసెంబ్లీ నియోజకవర్గం)లోని ప్రభుత్వ భూమిలో MIM కార్పొరేటర్లకు చెందిన అనేక వాణిజ్య దుకాణాలను తొలగించి, దాదాపు 3000 చదరపు గజాల రూ. 30 కోట్ల విలువైన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంది. కాబట్టి, సంక్షిప్తంగా HYDRAA ఎవరి పట్ల మెతక వైఖరిని అవలంబించడం లేదు. సామాజిక కారణాల వల్ల మాత్రమే ఫాతిమా ఉమెన్స్ కాలేజీ కూల్చివేతను నిలిపివేసింది. HYDRAA చిన్నచిన్న రాజకీయ ఆలోచనలతో ప్రభావితం కాకుండా, బలమైన దేశాన్ని నిర్మించాలనే పెద్ద చిత్రాన్ని చూస్తుంది. నిజానికి, నాలాలు/సరస్సుల పక్కన పదుల సంఖ్యలో అలాంటి విద్యాసంస్థలు/కళాశాలలు/పాఠశాలలు నిర్మించబడ్డాయి. దాతృత్వంతో నడుస్తున్న ఫాతిమా కాలేజీని ఎందుకు లక్ష్యంగా చేసుకోవాలి? డబ్బు సంపాదించడానికి, వాణిజ్యపరంగా నడుస్తున్న కళాశాలలను నిజంగా మొదట లక్ష్యంగా చేసుకోవాలి మరియు అవి సరస్సుల ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చివేయాలి. హైడ్రా లేదా మరేదైనా సంస్థ విచక్షణారహితంగా ఉండకూడదు. ఉద్యోగ నిర్వహణలో అంతరంతరాలను తెలుసుకొనే వ్యవహరించాలి. విశాలమైన ప్రజా ప్రయోజనాలు, సామాజిక సమతుల్యత, దేశ / జాతి నిర్మాణం లక్ష్యాల కోసం కృషి చేయాలి. అలాగని, నేరపూరిత అక్రమాలపై విచక్షణారహితమైన మినహాయింపుని ఇవ్వాలని కాదు. ఈ కారణం వలన ఎక్కడైతే విశాలమైన ప్రజా ప్రయోజనాల రీత్యా కఠిన చర్యలు అనివార్యం అయినవో, అక్కడ హైడ్రా నిర్హేతుకంగా అట్టి చర్యలు చేపడుతోంది. బుమ్రుకండ్ దౌల కబ్జా కాకుండా అడ్డు కట్ట వేయడం, చాంద్రాయణగుట్ట ప్రాంతంలో ఇదే రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు కబ్జా చేసినటువంటి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం దీనికి నిదర్శనం. పెళ్లికీ పిడ్డుకీ ఒకే మంత్రం అనే తీరున ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించినట్లయితే ఇది సామాజిక, దేశ పురోగతికి గొడ్డలి పెట్టవుతుంది.


# టీడీపీలోనూ.. మంత్రి ఆనంకు ఇక కష్టమే!



సాక్ష్యాత్తు విద్యాశాఖ మంత్రి, టీడీపీతో పాటు కూటమి ప్రభుత్వ అనధికార రథసారథి నారా లోకేశ్ ఎదుటే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తనదైన స్టైల్‌లో సహచర మంత్రి నారాయణకు చురకలు అంటించారు. తాను మధ్య తరగతి కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, కానీ మంత్రి నారాయణ పరిస్థితి అది కాదని ఆనం చెప్పారు. కార్పొరేట్ శక్తిగా ఎదిగిన తర్వాతే నారాయణ రాజకీయాల్లోకి వచ్చారని నారాయణపై నోరు చేసుకున్నారు. అలాగే విద్యా వ్యవస్థను నెల్లూరు జిల్లాలో కార్పొరేటీకరించారని నారాయణను ఉద్దేశించి ఆనం అన్నారు. విద్యను కార్పొరేటీకరించడం ద్వారా, నాశనం చేశాడని మంత్రి నారాయణను పరోక్షంగా మంత్రి ఆనం విమర్శించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే వెంకటగిరి రాజా పేరుతో స్థాపించిన వీఆర్ విద్యాలయాన్ని, యథాతథంగా కొనసాగించామని, మీరు కూడా అట్లే చేయాలని మంత్రి నారాయణను కోరారు. ఇదే సందర్భంలో మున్సిపల్ కార్పొరేషన్ అనే యాడ్ చేయడం వల్ల వెంకటగిరి రాజా వారిని అగౌరవపరిచినట్టు అవుతుందని ఆనం హెచ్చరించారు. ఎందుకోగానీ, సమావేశంలో మంత్రి నారాయణను టార్గెట్ చేసినట్టుగా ఆనం కఠినంగా మాట్లాడారు. విద్యను వ్యాపారం చేసుకుని, కార్పొరేట్ శక్తిగా అవతరించావని, పేదలకు ఉచిత విద్య అందించాలని, అప్పుడు తాము కూడా మీ బాటలో నడుస్తామంటూ ఉచిత సలహా రూపంలో దెప్పి పొడిచినట్టుగా వుంది. అయితే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రసంగంలోని ఈ అంశాల్ని టీడీపీ ఎడిట్ చేయడం గమనార్హం. అంటే, సభలో ఆనం అలా మాట్లాడకుండా వుండాల్సిందనేది పార్టీ అధిష్టానం ఉద్దేశంగా కనిపిస్తోంది. మొదటి నుంచి ఆనం రామనారాయణరెడ్డి వైఖరి ఇంతే. నిర్మొహమాటంగా మాట్లాడ్తాననే పేరుతో, సొంత పార్టీ ముఖ్యులపై ఆయన బహిరంగంగా విమర్శలు గుప్పిస్తుంటారు. గతంలో వైసీపీలో ఇలా చేసే, చివరికి ఆ పార్టీ నుంచి బయటికి వెళ్లాల్సి వచ్చింది. తాజాగా ఆనం సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని మంత్రి పదవి ఇచ్చినా, ఎందుకో ఆయన తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు %ా%లోకేశ్ సమక్షంలో ఆయన మాటలు చెప్పకనే చెబుతున్నాయి. ఇలాగైతే టీడీపీలో రానున్న రోజుల్లో ఆయనకు కష్టకాలం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# విశాఖకు భారీ ఐటీ సంస్థ.. 10 వేల ఉద్యోగాలతో ఏఎన్ఎస్ఆర్ క్యాంపస్

వెలగపూడి,ఏపీని పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధికి ఊతమిస్తూ, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటులో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఏఎన్ఎస్ఆర్ సంస్థ విశాఖపట్నంలో భారీ క్యాంపస్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. మధురవాడ ఐటీ క్లస్టర్‌లో అత్యాధునిక జీసీసీ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రానున్న ఐదేళ్లలో 10,000 మందికి పైగా నాణ్యమైన ఉద్యోగాలు లభించనున్నాయి. మంత్రి నారా లోకేశ్ సమక్షంలో నేడు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఎన్ఎస్ఆర్ సంస్థ సీఈఓ లలిత్ అహూజా మాట్లాడుతూ, "ప్రపంచ స్థాయి ప్రతిభ, బలమైన మౌలిక సదుపాయాలు, దార్శనిక నాయకత్వం వంటివి విశాఖలో మేళవించి ఉన్నాయి. ఇవి అద్భుతాలు సృష్టించేందుకు దోహదపడతాయి. మా ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మక సంస్థలకు విశాఖను ఒక ప్రధాన గమ్యస్థానంగా మారుస్తుంది" అని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిభావంతులను ప్రపంచ స్థాయి కంపెనీలతో అనుసంధానించడంలో తమ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com